# పనికిరానివాడు

వద్దిపాటి హనుమంతరావు


"ఇంకోనోటివ్వండి."

తిరిగొచ్చిన ఆ పదిరూపాయల నోటువంక అప్పుడుగాని పరీక్షగా చూడలేదు.

మాసి, నలిగి, అంచులు చిరిగి, మధ్య చిల్లులు పడి మెత్తగా ఉంది. నా జేబులో కెలా వచ్చింది?

అన్యమనస్కంగా ఉన్నప్పుడు ఎవడో మస్కా వేశాడు.

కొత్త కాగితాల మధ్య పెడితే ఈ చెత్త నోటు చెల్లిపోతుంది. కానీ, ప్రస్తుతానికి నా దగ్గరున్న ఒక్క నోటూ అదే. చిల్లర పది పైసలతో టీ రాదు.



తాగబోతున్న టీని తిరిగి ఇచ్చేసి వాడిచ్చిన చెత్త నోటును పట్టుకుని బయలుదేరాను.

ఈ నోటును మార్చట మెలా?

కొండపల్లి పోయిందాకా తెలిసిన మొహం లేదే! చీరాల బస్సు స్టాండులో చిల్లర కోసం పత్రిక కొనాల్సి వచ్చింది. బస్సు బయలుదేరే హడావుడి లో నోటు చూసుకోలేదు. ఫేరూ ఫ్లస్ సాదర ఖర్చులు పోనూ మిగిలిం దీ నోటే.

పది పైసలతో కొండపల్లి చేరటం ఇంపాజిబుల్. ఊరుకాని ఊరు. ఈ బెజవాడలో చిక్కడిపోయాను. వెనక్కు పోవటానికీ లేదు. ముందుకు సాగటానికీ లేదు. ఏదో విధంగా ఈ పదిరూపాయల నోటుని మార్చాలి. బాంకుల టైము కాదు. సాయంత్రం అయిదున్నరయింది.

(కొన్ని బాంకులు ఉంటాయి గాని, ముక్కూ మొగం తెలీనివాళ్ళ దగ్గర చెత్త నోట్లు ఎక్స్చేంజ్ చేస్తాయన్న నమ్మకం లేదు).

చూపున్న ఏ నన్నాసి ఈ నోటును చస్తే తీసుకోడు. పోనీ డిస్కౌంటు రేటుకు ట్రై చేస్తేనో!

ఎలా అడగటం? ఎవరిని అడగటం? విజయవాడలో నోట్ల అనుపత్రి ఉందని విన్నాను. ఎక్కడుందో తెలీదు. ఎవరి నడిగినా ఫలితం లేకపోయింది.

ఎనిమిది గంటల లోపు నేను కొండపల్లి చేరుకోలేకపోతే నా ఈ ప్రయాణం వృథా.

'నువ్వు ప్రయోజకుడివిరా. పైకొస్తావు. డబ్బు సాయం నేను చేస్తాను. బి.ఎ. పరీక్షకు కట్టు' అన్న మేనమామ ఈ రాత్రే పనిమీద హైద్రాబాదు వెళ్ళుతున్నాడు. నెల రోజుల దాకా తిరిగి రాడు. పరీక్ష ఫీజు కట్టే సమయం దాటి పోతుం దప్పటి కైతే.

అందుకే హడావుడిగా దొరికిన డబ్బు చేత పుచ్చుకుని కొండపల్లి బయలుదేరాను సాయంత్రం.

'ఈ పది రూపాయల నోటు మార్చలేకపోతే ప్రాక్టికల్‌గా నేను పనికిరాని వాడి కిందే లెక్క. ఇంటర్‌లో సంపాదించుకున్న ఫస్ట్ క్లాసు ఇందుకు ఉపయోగిస్తుందా?'

రకరకాల ఆలోచనలు... కొన్ని ఆచరించలేనివి. కొన్ని ఆచరించగలిగినా అంతరాత్మ ఒప్పుకోనివి.

'రిక్షా బేరం చేసుకొని కొంత దూరం పోయి ఈ నోటు ఇస్తేనో?

తీసుకోక చస్తాడా? పాపం! కష్టజీవి!

గుడ్డివాడి బొచ్చెలో వేసి చిల్లర తీసుకుంటేనో! పదిరూపాయల చిల్లర బొచ్చెలో ఉండదు. అలా తీసుకోవడం ద్రోహం.'

ఆలోచనలతో బుర్ర వేడెక్కడమే కాని, ఫలితం లేదు. ఎదురుగా లీలా మహల్‌లో ఏదో ఇంగ్లీషు సినిమా రష్‌గా ఉంది. 'పోనీ అక్కడ కౌంటంలో ట్రై చేసి చూస్తేనో! ఆ హడావుడిలో వాడు నోటు చూడవచ్చాడా!'

రు. 2-20 కౌంటర్‌లో అరగంట నిలబడిన తరువాత కౌంటరు ముందు కొచ్చాను. నోటు తీసి కౌంటర్‌లోకి తోస్తుంటే గుండె గుబగుబలాడింది.

ఇందాక టీ స్టాలు ముందు ఏమీ అనిపించలేదు. అప్పుడు నోటు సంగతి తెలీదు.

ఇప్పుడు తెలుసు. మోసం... మోసం... అని అంతరాత్మ ఘోషిస్తూనే ఉంది.

'ఇందులో మోసం ఏముంది? దొంగనోటు కాదు గదా నే నిచ్చేది!' అని మరో వైపునుండి సమర్థన.

"ఈ నోటు పోదు" అనేశాడు కౌంటర్‌లో మనిషి కర్కశంగా.

గబాలున చెయ్యి బయటకు తీసేసుకుని మొహం చూపకుండా హాలు బయటకు వచ్చేశాను.

'ఇంక ఈ నోటును మార్చటం నా వల్ల కాదు. కొండపల్లిదాకా నడిచి పోవడ మొక్కటే మార్గం. లేదా...బెగ్గింగ్...

ఛీ...ఛీ...'నా మీద నాకే చచ్చే చిరాకుగా ఉంది.

"టికెట్ కావాలా, సార్!" అని పక్క కొచ్చి నిలబడ్డాడు ఓ కుర్రాడు.

పదిహేనే ళ్ళుంటాయి. పట్టీ బనీను మాసి, చినిగి, మడతలు పడి అచ్చు నా పదిరూపాయల నోటు లాగే ఉంది.

"2-20 ఫోర్ రుపీస్...2-20 ఫోర్ రుపీస్" అని మెల్లగా గొణుగుతున్నాడు.

బ్లాకులో టిక్కెట్లు అమ్ముతున్నాడని తెలుస్తూనే ఉంది. 'పోనీ నాలుగు రూపాయలకు టిక్కెట్టు కొంటే ఆరు రూపాయలన్నా మంచివి వస్తాయి. కొండపల్లిదాకా వెళ్ళవచ్చు.

ఎందుకైనా మంచిది ముందే నోటు సంగతి చెప్పి ఇవ్వటం...'

నోటును చూసి-"అయిదు రూపాయ లిస్తాను, సార్!" అన్నాడు ఆ కుర్రాడు.

అవసరాన్ని కనిపెట్టాడు-అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నాడు.

అసాధ్యుడు! జంకూ గొంకూ లేకుండా తెలిసి తెలిసి ఇలాంటి పరమ చెత్త నోటును తీసుకోవటానికి చాలా సాహసం కావాలి. అందులోనూ ఒక రూపాయి కాదు, రెండు రూపాయలు కాదు...పది రూపాయలు...అతని స్తోమతకు అది చాలా ఎక్కువే.

టికెట్+అయిదు రూపాయలు ఇచ్చాడు, పది రూపాయలు అందుకొని.

అడగకుండా ఉండలేకపోయాను-"ఈ నోటును నువ్వెలా మారుస్తావోయ్?"

"అదంతా ట్రేడ్ సీక్రెట్, సార్!" అని నవ్వాడు.

"చెబితే రూపాయి ఇస్తా!"

"అయితే, చెప్పను. మీ కంటిముందే మార్చి చూపిస్తా...రెండు రూపాయ లిస్తారా?" అన్నాడు సవాల్‌గా.

ఎలాగూ నా కీ అయిదు రూపాయలు తిరిగి చీరాల పోను సరిపోవు. కొండపల్లిలో ఎలాగూ తంటాలు పడాల్సిందే. సరే. మరో రూపాయి పారేసి ప్రపంచజ్ఞానం నేర్చుకుంటే పోయేదేముంది నాకు లేనప్పుడు!

ఒప్పుకున్నాను.

ఫుట్ పాత్ మీద అడుక్కునే గుడ్డి తాత దగ్గర పాత నోటు మదుపు పెట్టి ఎనిమిది రూపాయలు తెచ్చాడు. నన్నుకూడా వెనక నిలబెట్టి రెండు టిక్కెట్లు కొన్నాడు. చూస్తూండగానే పది నిముషాల్లో ఆ టికెట్లను రెట్టింపు రేటుకు గిట్టించేశాడు.

పావు గంటలో అయిదు రూపాయలు లాభం...అదీ పాత పనికిరాని నోటు పెట్టుబడితో...

"అడుక్కునే తాతకు ఆ నోటు మారదు. నువ్వు పాపం గుడ్డి తాతను మోసం చేశావు" అన్నాను.

"అందరి విషయం మన కనవసరం, సార్! మన పనేదో మనం చూసుకోవాలి. అడిగారు గనుక చెబుతున్నా. తాతకు బాంకులో అకౌంటుంది. ఏ నోటు ఇచ్చినా తీసుకుంటారు. వాడికి రెండు రూపాయలు లాభం. నాకు అయిదు రూపాయలు లాభం...మీకు పని జరిగింది..."

"ఇంత తెలివైన వాడివి మరెందుక నిలా రోడ్లు పట్టావు?" అనడిగాను రెండు రూపాయలు అందిస్తూ ఒక రకమైన అడ్మిరేషన్‌తో.

వాడు నవ్వాడు మిస్టీరియస్‌గా. "మా అయ్య నన్ను తన్ని తగలేశాడు చదూకోటల్లేదని, ఎందుకూ పనికిరానని..."

ఉలిక్కిపడ్డాను నేను.

పనికిరాని వాడు...

అతనా?...నేనా??...

ఎవరు??? వాడు చదువుకోలేదు. కనక భేషజం లేదు. నేను చదువుకున్నాను. కనక భేషజం నన్ను చొరవ చెయ్యనియ్యలేదు.

మంచికీ చెడుకూ కూడా పనికిరాని ఈ చదువు పనికిరాని వాడుగా తయారు చేస్తుంది నన్నే...

నాలాంటి ఎందర్నో...

